సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం ၊ 7 ၊ మే ၊ 2025



ఉద్యానం.. అధ్వానం

నర్సరీల నిర్వాహకులు రైతులకు నాసిరకం నారు అంటగడుతుండటంతో నష్టపోతున్నారు.

వివరాలు 8లో ▸



.. ఆర్థిక విధ్వంసం

గత బీఆర్‌ఎస్‌ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ ఆరోపించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.4 /21.4

మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత కనిపిస్తుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీయడంతో పాటు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్‌

రహదారి నిబంధనలు పాటించాలి



నాగర్‌కర్నూల్‌ క్రైం: వాహనచోదకులు మోటారు వాహన చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అదనపు ఎస్పీ రామేశ్వర్‌ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కొల్లాపూర్‌ క్రాస్‌రోడ్‌లో వాహన తనిఖీలు చేపట్టి పలు వాహనాలను సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్‌ లైసెన్స్‌, ఆర్సీ, ఇన్స్యూరెన్స్‌ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు. ఆర్టీసీ అద్దె బస్సులు ఇన్స్యూరెన్స్‌ లేకుండా రోడ్లపైకి వస్తే సీజ్‌ చేస్తామని హెచ్చరించారు.

తూకంలో తేడాలుంటే చర్యలు



కోడేరు: వరి ధాన్యం తూకంలో తేడాలొస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఆర్డీఓ ఓబులేష్‌ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు జనుంపల్లిలోని వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా క్వింటాకు 3 నుంచి 4 కిలోలు అదనంగా తూకం చేస్తున్నారని సీపీఎం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సంచి తూకం తప్ప అదనంగా కాంటా చేయొద్దని నిర్వాహకులకు సూచించారు. తూకంలో అవకతవకలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం పార్వతమ్మ, వెంకటేశ్‌, మహేష్‌, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అన్నదాత విలవిల



మిల్లు వద్ద నిలిచిన వరి ధాన్యం ట్రాక్టర్లు

కల్వకుర్తి రూరల్‌: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించుకునేందుకు అన్నదాతలకు అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకొంటున్నా.. అవి అరకొరగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అష్టకష్టాలు పడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినా.. రైస్‌మిల్లులో దించాలంటే అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ డివిజన్‌ పరిధిలోని కల్వకుర్తి, వంగూరు, వెల్దండ, ఊర్కొండ, చారకొండ మండలాల పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రెండు పారా బాయిల్డ్‌ మిల్లులకు తరలించాలని అధికారులు ఆదేశాలిచ్చారు. డివిజన్‌ మొత్తానికి సద్గురు రాఘవేంద్ర, వెంకటేశ్వర మిల్లులు మాత్రమే కేటాయించారు. రైతులు పెద్దఎత్తున సొంత, అద్దె ట్రాక్టర్లు, డీసీఎం వాహనాల్లో ధాన్యాన్ని మిల్లులకు తీసుకొచ్చినా.. దించేందుకు అక్కడే పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం అధికంగా రావడంతో పాటు హమాలీల సమస్య మిల్లర్లకు ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉంటే కొనుగోలు కేంద్రాల్లో భారీగా ధాన్యం నిల్వ ఉంది. ప్రస్తుతం వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి.. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ సాయంత్రం అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతులు విలవిలలాడుతున్నారు. వర్షానికి ధాన్యం తడవకుండా కాపాడుకొనేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యాన్ని త్వరగా దించుకోకపోవడంతో ఓ వైపు అద్దె భారం, మరోవైపు వర్షం వస్తే ఎలా అనే ఆందోళన ఇబ్బందులకు గురిచేసింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల మిల్లులను సందర్శించి రైతుల ఇబ్బందులను గుర్తించి మరో రెండు మిల్లులు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. అయితే ఇంకా ఆ ప్రక్రియ ముందుకుసాగలేదు. అకాల వర్షానికి ధాన్యం తడిసి రైతులు నష్టపోతారని.. ఇబ్బందులు కలగకుండా చూడాలని రైతు సేవాసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పసుల గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ విషయాన్ని పీఏసీఎస్‌ సీఈఓ వెంకట్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా.. తక్కువ మిల్లులు కేటాయించడంతో సమస్యలు వస్తున్నాయని, మూడురోజులుగా మిల్లుల వద్ద ధాన్యం వాహనాలు నిలిచిపోయాయని, మరిన్ని మిల్లులకు అవకాశమిస్తే సమస్య తీరుతుందన్నారు.

మామిడి రైతు కుదేలు

అకాల వర్షాలు, ఈదురు గాలులతో తీవ్రనష్టం



కొల్లాపూర్‌ శివారులో ఈదురుగాలులకు నేలరాలిన మామిడి కాయలు

- మూడేళ్లలో ఎన్నడూ లేనంతగా జీభత్సం సృష్టించిన గాలులు
- కల్వకుర్తి, బిజినేపల్లి ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లు
- వాతావరణం అనుకూలించక పంట దిగుబడిపై ప్రభావం
- ఆర్థికంగా చితికిన రైతులు.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

జిల్లాల వారీగా మామిడి తోటల ఎకరాల సాగు ఇలా..

నాగర్‌కర్నూల్‌ 34,712	వనపర్తి 16,050
మహబూబ్‌నగర్‌ 9,275	జోగుళాంబ గద్వాల 5,124
నారాయణపేట 3,604	

కొల్లాపూర్‌: వాతావరణ ప్రభావంతో అంతంత మేరకే దిగుబడులు.. చేతికొచ్చిన దాన్ని అమ్ముకునే సమయానికి అకాల వర్షాలు, భారీ ఈదురుగాలులు మామిడి రైతులను కుదేలు చేశాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు లాభాలు రాకపోగా.. కష్టాలు.. నష్టాలు చుట్టుముట్టి రైతన్నల నడ్డి విరుస్తున్నాయి.

నామమాత్రపు దిగుబడులు

ఉమ్మడి జిల్లాలో ఈ సంవత్సరం మామిడి దిగుబడులు నామమాత్రంగానే ఉన్నాయి. మొదట్లో పూతలు బాగా పూసినప్పటికీ వాతావరణంలో మార్పులు, చీడపీడల కారణంగా ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాలేదు. సాధారణ దిగుబడి కంటే సగం మేరకు తక్కువగా దిగుబడులు వచ్చాయి. పండిన ఆ కాస్త పంటను అమ్ముకునే సమయంలో మామిడి రైతులపై ప్రకృతి కన్నెర్ర చేస్తోంది. ఏప్రిల్‌ నెల మూడో వారం నుంచి తరచూ వీస్తున్న భారీ ఈదురు గాలులు, అకాల వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా మామిడి తోటలు దెబ్బతిని.. కాయలు పెద్దమొత్తంలో రాలిపోయాయి. కొన్నిచోట్ల చెట్లు సైతం నెలకొరిగాయి.

300 టన్నులకు పైగా..



నాగర్‌కర్నూల్‌ జిల్లాలో ఈదురుగాలులు, వర్షాల కారణంగా ఏప్రిల్‌ నెలాఖరులో 300 టన్నులకు పైగా మామిడి కాయలు నేలరాలాయి. వీటిని విక్రయించేందుకు హైదరాబాద్‌ మార్కెట్‌కు తీసుకువచ్చారు. మార్కెట్లో రాలిన కాయలను తక్కువ ధరలకు రైతులు అమ్ముకున్నారు. ఇప్పుడు కూడా రోజూ రాలిన కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి తక్కువగా ఉంది. దీనికి తోడు గాలివానల వల్ల రైతులు ఆర్థికంగా చాలా నష్టపోయారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సలీం, మామిడి ఎక్స్‌పోర్ట్‌ కన్సల్టెంట్‌, కొల్లాపూర్‌

నష్టంపై నివేదికలిచ్చాం..

అకాల వర్షాలు, భారీ ఈదురుగాలుల కారణంగా మామిడి తోటల్లో పెద్దమొత్తంలో కాయలు రాలాయి. నియోజకవర్గాల వారీగా పంటనష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. కొల్లాపూర్‌ నియోజకవర్గంలో చెట్లు విరిగిపడిన సంఘటనలు లేవు. కానీ, కాయలు చాలా రాలాయి. రాలిన కాయలను మార్కెట్లో ధరలు ఉండవు. ఈ విషయాన్ని కూడా ఉన్నతాధికారులకు తెలియజేశాం.

– లక్ష్మణ్‌, ఉద్యానవన శాఖ అధికారి, కొల్లాపూర్‌

సరైన ధరలు లేక..

మామిడి దిగుబడుల సంగతి పక్కన పెడితే.. ధరలు ఈ ఏడాది కూడా పెరగలేదు. ఇందుకు వ్యాపారుల సిండికేటే ప్రధాన కారణం. ఫిబ్రవరి నెలలో టన్ను రూ.లక్షకు పైగా పలికిన మామిడి ధర.. మార్చి మొదటి వారంలో పూర్తిగా తగ్గిపోయాయి. టన్ను ధర రూ.40 వేల నుంచి రూ.70 వేలకు పడిపోయింది. ప్రస్తుతం రూ.30 వేల నుంచి రూ.50 వేలు మాత్రమే పలుకుతోంది. గాలివానల కారణంగా రాలిన మామిడి కాయలను హైదరాబాద్‌ మార్కెట్‌లో టన్నుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల లోపు కొనుగోలు చేస్తున్నారు. అంటే రైతులు పండించిన పంటకు రవాణా, కూలీ డబ్బులు కూడా రాని పరిస్థితి.

నష్టం అంచనాకు సాంకేతిక సమస్యలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 68,765 ఎకరాల్లో మామిడి తోటలు సాగు అవుతున్నాయి. వీటిలో కొల్లాపూర్‌ నియోజకవర్గ పరిధిలోనే అత్యధికంగా 25 వేల ఎకరాలకు పైగా తోటలు ఉన్నాయి. గత మూడేళ్లలో ఎన్నడూ లేనంతగా ఈసారి పంట నష్టం జరిగింది. ఈదురుగాలులు, వర్షాల కారణంగా కల్వకుర్తి, బిజినేపల్లి మండలాల్లో భారీగా చెట్లు నెలకొరిగాయి. ఈ రెండు ప్రాంతాల్లో 82 మంది రైతులకు సంబంధించి 272 ఎకరాల్లో చెట్లు నేలకొరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఇతర ప్రాంతాల్లో జరిగిన పంట నష్టాలపై సమాచారం సేకరించలేదు. వాస్తవంగా పంట నష్టం భారీస్థాయిలో జరిగింది. కానీ, మామిడి పంటనష్టం అంచనా వేసేటప్పుడు అధికారులు నేలరాలిన కాయలను పరిగణలోకి తీసుకోరు. చెట్లు నెలకొరిగితేనే లెక్కలోకి తీసుకుంటారు. ఈ రకమైన సాంకేతిక సమస్యల కారణంగా మామిడి పంటనష్టంపై పూర్తిస్థాయి నివేదిక అధికారులు రూపొందించలేకపోతున్నారు.



విరిగిన మామిడి చెట్లు

కొలిక్కిరాని ఇందిరమ్మ ఇళ్ల జాబితా

- సర్వేలతో ఎల్‌–1, 2, 3 కేటగిరీలుగా విభజన
- తుది జాబితా రూపకల్పనకు అధికారుల అవస్థలు



అచ్చంపేటలో సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్‌)

అచ్చంపేట: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు దరఖాస్తుదారులకు గగనంగా మారుతోంది. దరఖాస్తులు అధికంగా.. మంజూరు తక్కువగా ఉండటంతో మొదటి విడత అదృష్టం ఎవరిని వరిస్తుందనే ఉత్కంఠ నెలకొంది. లబ్ధిదారుల ఎంపికను పర్యవేక్షించే ఇందిరమ్మ కమిటీలు, అధికారులకు ఇది ఒక సాహసంగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో మార్పుచేర్పులతో అయోమయం నెలకొంది. పట్టణాల్లో పథకం అమలుపై స్పష్టత కరువైంది. పురపాలికల్లో ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను వివిధ దశల్లో వడపోశారు. స్థలం ఉండి ఇల్లు లేని వారిని ఎల్‌–1, ఇంటి స్థలం లేని దరఖాస్తుదారులను ఎల్‌–2, ఇతరులను ఎల్‌–3 కేటగిరీగా నిర్ధారించారు. జిల్లాలోని పురపాలికల్లోతొలి దశ సర్వే అనంతరం ప్రత్యేక బృందాలతో మరోసారి వడపోసి తుది జాబితాను రూపొందించారు. ఇవన్నీ కాదని ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాల పేరిట ప్రధానమంత్రి ఆవాస యోజనలో భాగంగా 673 మంది లబ్ధిదారుల వివరాలతో జాబితాను పంపించి సర్వే చేపట్టారు. తాజాగా.. ఆ జాబితా కూడా కాదని మరోటి వస్తుందని, దానిని అనుసరించి సర్వే చేయాలని ఆదేశాలు అందాయి. ఇప్పటికే నాలుగు పర్యాయాలు వార్డుల్లో సర్వే జరిగింది. మరో కొత్త జాబితా ప్రకారం సర్వే చేయడానికి ప్రజల వద్దకు వెళ్లేందుకు అధికారులు వెనుకాడుతున్నారు.

ఇదీ కథ..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు అందజేయనుంది. పురపాలికల్లో ఈ పథకానికి పీఎంఏవైని అనుసంధానించాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఎంఏవైని అమలు చేస్తే ఒక్కో ఇంటికి రూ.75 వేలు, పట్టణాల్లో రూ.1.50 లక్షలు కేంద్రం వాటాగా అందుతుంది. పీఎంఏవై నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని.. ఎట్టి పరిస్థితుల్లో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయొద్దని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. సర్వేచేసి లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయడంతో పాటు పెండింగ్‌ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేస్తున్నారు.

కఠిన నిబంధనలు..

జిల్లాలోని పురపాలికలకు గృహనిర్మాణశాఖ ద్వారా అందిన ఎల్‌–1 కేటగిరీ లబ్ధిదారుల పేర్లను వార్డుల వారీగా విభజించారు. సుమారు 60 మంది వివరాలు వెబ్‌సైట్‌లో లేవని గుర్తించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేయని వారి పేర్లు జాబితాలో ఉన్నట్లు తెలిసింది. లబ్ధిదారులు ఆధార్‌తో పాటు వారి తల్లిదండ్రుల ఆధార్‌ వివరాలు సమర్పించాలనే నిబంధన ఉంది. దరఖాస్తుదారుల్లో 50 నుంచి 60 ఏళ్ల వయసున్న వారు చాలామంది ఉన్నారు. తల్లిదండ్రుల ఆధార్‌ వివరాలు లేకపోవడంతో అప్‌లోడ్‌ చేయలేకపోయారు. దీంతోపాటు ఆదాయ ధ్రువీకరణ, పాన్‌ కార్డు, స్థలం రిజిస్ట్రేషన్‌ పత్రాలను అప్‌లోడ్‌ చేయాలనే నిబంధనలు ఆటంకంగా మారాయి. 15 రోజుల అనంతరం కొన్నింటికి ఎడిట్‌ ఆప్షన్లు వచ్చాయి. అయినా కొన్ని దరఖాస్తులనే పీఎంఏవై వెబ్‌సైట్‌లో చేర్చారు. 500 మంది జాబితాలో వార్డుకు ఎందరిని ఎంపిక చేయాలనే సూచన లేదు. నాయకుల ఒత్తిడి, వార్డుల్లో ప్రజల ప్రతిఘటనతో సర్వే నత్తనడకన సాగుతోంది. ఇదిలా ఉండగా.. రెండు, మూడు రోజుల్లో వచ్చే జాబితాను అనుసరించి సర్వే చేయాలని, గతంలో చేసిన సర్వేలు, జాబితాలతో సంబంధం లేదని అంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి ముందుకెళ్తామని పుర కమిషనర్లు చెబుతున్నారు.

పారదర్శకంగా ఎంపిక..



జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పారదర్శకత పాటిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఇల్లిల్లూ తిరిగి సర్వే చేపడుతున్నాం. ప్రస్తుతం ఎల్‌–1 జాబితాలో ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎల్‌–2లో పొరపాట్లను సరిదిద్దుతున్నాం. ఈ రెండు జాబితాలను పరిగణలోకి తీసుకొని సర్వే చేపడుతున్నాం.

– సంగప్ప, పీడీ, గృహనిర్మాణశాఖ, నాగర్‌కర్నూలు

వడపోతే కష్టం..

దరఖాస్తులు భారీగా రావడం.. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తుండటం సమస్యగా మారింది. జనవరిలో పైలెట్‌ గ్రామంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపికచేసి పథకం ప్రారంభించారు. అక్కడ దరఖాస్తుదారులందరికీ ఇళ్లు మంజూరు చేశారు. ఆ తర్వాత ఇళ్లను మినహాయించి మిగతా ఇళ్లను కేటాయించడంతో కుదించాల్సి వస్తోంది. నియోజకవర్గంలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా తొలుత మండలానికి, తర్వాత గ్రామానికి కేటాయించారు. కొన్నిచోట్ల ఇళ్లు ఒక అంకెకే పరిమితం కాగా.. చాలా గ్రామాలు, వార్డుల్లో రెండు, మూడు, నాలుగు చొప్పున ఇళ్లు కేటాయించారు.

నెరవేరనున్న కల

పీయూలో ప్రభుత్వ లా, ఇంజినీరింగ్‌ కళాశాలలు



- 2025–26 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభం
- యూనివర్సిటీలో పూర్తి కావస్తున్న భవనాల నిర్మాణం
- ఇంజినీరింగ్‌లో 180, న్యాయ విద్యలో 140 సీట్లు
- టీచింగ్‌, నాన్‌టీచింగ్‌ సిబ్బంది నియామకానికి సన్నాహాలు
- ప్రభుత్వానికి లేఖ రాసిన విశ్వవిద్యాలయ అధికారులు
- రెండు కళాశాలల్లో 100కు పైగా పోస్టుల భర్తీకి అవకాశం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్‌: పాలమూరుకు చెందిన పేద విద్యార్థులు ఎవరైనా లా, ఇంజినీరింగ్‌ విద్యనభ్యసించేందుకు నానాతంటాలు పడేవారు. ప్రభుత్వ పరిధిలో ఆయా కళాశాలలు జిల్లాలో లేకపోవడమే ఇందుకు కారణం. న్యాయవిద్య కోసమైతే హైదరాబాద్‌, విజయవాడ, కర్నూలు, వరంగల్‌ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇంజినీరింగ్‌ చదవాలని ఆకాంక్షించే వారిదీ అదే పరిస్థితి. లేదంటే వారికి ప్రైవేట్‌ కళాశాలలే దిక్కయ్యేవి. ఉమ్మడి జిల్లాకేంద్రంలో పాలమూరు యూనివర్సిటీ 2008లో ఏర్పాటైనా.. ఇన్నాళ్లుగా న్యాయ విద్య, ఇంజినీరింగ్‌కు సంబంధించిన ప్రభుత్వ కళాశాలల ఊసే లేకుండాపోయింది. ఎట్టకేలకు ఉమ్మడి జిల్లాలో లా, ఇంజినీరింగ్‌ చదవాలన్న విద్యార్థుల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. 2025–26 విద్యాసంవత్సరం నుంచి అంటే జూలైలో పీయూ పరిధిలో ఆయా విభాగాల్లో ప్రవేశాలు కల్పించే విధంగా అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. దీంతో పాటు టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ సిబ్బంది నియామకాలపై సన్నాహాలు మొదలుపెట్టారు.

ఇంజినీరింగ్‌లో 3 విభాగాల్లో..

ఇంజినీరింగ్‌లో మొత్తం మూడు విభాగాలను ప్రారంభించనున్నారు. ఇందులో డాటా సైన్స్‌, ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌, బీటెక్‌లో సీఎస్‌సీ కోర్సులను అందుబాటులోకి తేనున్నారు. ప్రతి కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 180 సీట్లను భర్తీ చేయనున్నారు. న్యాయవిద్యకు సంబంధించి యూజీ, పీజీ, స్థాయిలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సులను ప్రారంభించనున్నారు. ఎల్‌ఎల్‌బీలో రెండు సెక్షన్ల ఏర్పాటుకు అనుమతి వచ్చింది. ఒక్కో సెక్షన్‌లో 60 చొప్పున 120 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. పీజీ స్థాయిలో ఎల్‌ఎల్‌ఎం కోర్సు కూడా ఉంది. ఇందులో కేవలం 20 సీట్లు ఉన్నాయి. ఇంజినీరింగ్‌లో ప్రవేశాలు పొందాలంటే ఈపీ సెట్‌, ఎల్‌ఎల్‌బీలో అయితే లాసెట్‌ రాసి మెరుగైన ర్యాంక్‌లు సాధించాల్సి ఉంటుంది.

70 టీచింగ్‌.. 30 నాన్‌ టీచింగ్‌ పోస్టుల భర్తీ

పీయూలో లా, ఇంజినీరింగ్‌ కళాశాలలను ప్రారంభించాలంటే తప్పకుండా టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. జూలై, ఆగస్టుల్లో ఈపీ సెట్‌, లాసెట్‌ కౌన్సిలింగ్‌లు పూర్తయిన తర్వాత విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ క్రమంలో రెండు కళాశాలల్లో సుమారు 100కు పైగా పోస్టులను భర్తీ చేయాలి. వీటిలో 70 టీచింగ్‌ పోస్టులు కాగా.. 30 వరకు నాన్‌ టీచింగ్‌ పోస్టులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోస్టుల భర్తీకి అనుమతులు ఇవ్వాలని పీయూ అధికారులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. మొదటగా ప్రభుత్వం రెగ్యులర్‌ ప్రతిపాదికన పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుంది. ఇందులో జాప్యం జరిగితే పీయూ పానా యంత్రాంగం నేరుగా కాంట్రాక్ట్‌, పార్ట్‌టైం ప్రాతిపదికన అధ్యాపక పోస్టులను భర్తీ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కాగా.. గత సంవత్సరం పీయూకు లా డిపార్ట్‌మెంట్‌ మంజూరైంది. దీంతో వనపర్తిలోని ఓ ప్రైవేట్‌ కళాశాలకు యూనివర్సిటీ అనుమతి ఇచ్చింది. పలువురు విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. తాజాగా త్వరలో పీయూ కళాశాలలో న్యాయ విద్యతో పాటు ఇంజినీరింగ్‌ విభాగంలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనుండడంతో ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులకు మేలు జరగనుంది.

చివరి దశలో భవనాల నిర్మాణం..

పీయూలో లా, ఇంజినీరింగ్‌ కళాశాలల భవనాల నిర్మాణాలు పూర్తి కావొస్తున్నాయి. యూనివర్సిటీలో ప్రస్తుతం నిర్మితమవుతున్న సైంటిఫిక్‌ రీసెర్చ్‌ భవనంలో కొంత భాగాన్ని ఇంజినీరింగ్‌ కళాశాలకు కేటాయించనున్నారు. అదేవిధంగా నిర్మితమవుతున్న ఎంఈడీ కళాశాల భవనం మొదటి అంతస్తులో లా కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా భవనాల పనులు చివరి దశలో ఉన్నాయి. వీటితో పాటు ఆయా విభాగాల్లో అడ్మిషన్లు పొందే విద్యార్థులు సుమారు 300 మందికి హాస్టల్‌ వసతి కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కొత్తగా హాస్టల్‌ భవనాలు నిర్మించే వరకు తాత్కాలికంగా వసతికల్పించేలా ముందుకు సాగుతున్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఇదివరకే వేర్వేరుగా నిర్మించిన హాస్టల్‌ భవనాల్లోనే లా, ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందే వారిని సర్దుబాటు చేసే అవకాశాలు ఉన్నాయి.



పీయూలో లా కళాశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మాదిరి కోర్టు నమూనా

నాణ్యమైన విద్య అందిస్తాం..



2025–26 విద్యాసంవత్సరానికి పీయూలో లా, ఇంజినీరింగ్‌ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. భవనాల నిర్మాణం చివరిదశలో ఉంది. సిబ్బంది నియామకంపై ప్రభుత్వానికి లేఖ రాశాం. న్యాయ విద్యలో మూడు (ఎల్‌ఎల్‌బీలో రెండు సెక్షన్లు, ఎల్‌ఎల్‌ఎం).. ఇంజినీరింగ్‌లో మూడు కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తాం. విద్యార్థులకు అన్ని వసతులతో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తాం.

– శ్రీనివాస్‌, వైస్‌ఛాన్స్‌లర్‌, పీయూ

పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలి..



యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్‌ కళాశాలలను ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయం. ఉమ్మడి పాలమూ రు జిల్లా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. ఏర్పాటు చేయనున్న కళాశాలల్లో అన్ని వసతులు కల్పించాలి. ఇబ్బందుల్లేకుండా పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలి.

–వంశీ, పీయూ ఎస్‌ఎఫ్‌యూఐ అధ్యక్షుడు

ఆర్‌ఎన్‌ఆర్‌ ధర రూ.2,113

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్‌ యార్డులో మంగళవారం ఆర్‌ఎన్‌ఆర్‌ ధాన్యం క్వింటాకు గరిష్టంగా రూ.2,113, కనిష్టంగా రూ.1,709 ధర వచ్చాయి. హంస రూ.1,809–రూ.1,732, ఆముదాలు రూ.5,869 ధర పలికాయి. మార్కెట్‌కు దాదాపు వెయ్యి బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

నేడు ఉల్లి వేలం..

దేవరకద్ర మార్కెట్‌ యార్డులో బుధవారం ఉదయం 10 గంటలకు ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహిస్తారు. వివిధ గ్రామాల నుంచి రైతులు తెచ్చే ఉల్లిని స్థానిక వ్యాపారులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు వేలం ద్వారా కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి ధరలు దిగిరావడంతోపాటు నిల్వ చేసుకునే విధంగా నాణ్యతగా ఉండటంతో వినియోగదారులు పెద్దఎత్తున ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు.

నేడు యార్డుకు సెలవు

జడ్చర్ల టౌన్‌: వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని పురస్కరించుకుని బుధవారం బాదేపల్లి మార్కెట్‌ యార్డుకు సెలవు ప్రకటించారు. మార్కెట్‌లో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని, రైతులు ధాన్యం తీసుకురావొద్దని చైర్‌పర్సన్‌ జ్యోతి చెప్పారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా: వ్యక్తి దుర్మరణం



రాజోళి: పొలం పనులు చేసి ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకొస్తున్న సందర్భంలో ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మాన్‌దొడ్డి శివారులో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఉప్పరి నర్సింహులు తన పొలంలో ట్రాక్టర్ టిల్లర్ కొట్టాలని సోమేశ్వర్‌రెడ్డి(51)ని కోరాడు. పచ్చర్లలోని పొలంలో టిల్లర్ కొట్టేందుకు వెళ్లాడు. పని పూర్తయిన తర్వాత పచ్చర్ల–మాన్‌దొడ్డి మధ్యలో మూల మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో సోమేశ్వర్‌రెడ్డికి నడుములకు బలమైన గాయాలు కాగా, చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో అతని భార్య జయలక్ష్మి రాజోళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

కేఎల్ఐ కాల్వలో పడి మహిళ మృతి

కల్వకుర్తి రూరల్: పట్టణ సమీపంలోని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాల్వలో పడి మహిళ మృతిచెందినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని మార్చాలకు చెందిన ప్రభావతి (40) భర్త పిల్లలతో కలిసి కొన్నిరోజులుగా కల్వకుర్తిలో నివాసం ఉండేది. సోమవారం సాయంత్రం నుంచి ఆమె ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెదికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం పట్టణ సమీపంలోని కేఎల్ఐ కాల్వలో ఆమె మృతదేహం కనిపించడంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భర్త విష్ణు, ఆడపడుచు భీమమ్మ వేధింపులు తట్టుకోలేక తమ సోదరి ఆత్మహత్య చేసుకుందని, మృతిపై అనుమానం ఉందని సోదరుడు ప్రకాష్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బావిలో పడి యువకుడు మృతి

కోడేరు: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం ఎత్తం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రామస్వామి (24) మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని రాళ్లబావికి వెళ్లి దుస్తులు ఉతికిన అనంతరం బావిలో ఈత కొడుతుండగా మూర్చ రావడంతో బావిలోనే మృతిచెందాడు.

యువకుడి బలవన్మరణం

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం గ్రామంలో ఓ యువకుడు మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన అరవింద్‌కుమార్ (23) ట్రాక్టర్‌తో పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్దిరోజులుగా ఎలాంటి పనులకు వెళ్లకపోవడంతో తండ్రి మందలించగా ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూసి హుటాహుటిన కర్నూలు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉద్యానం.. అధ్వానం



నర్సరీలో పెంచుతున్న కూరగాయల నారు

- నాసిరకం నారుతో నష్టపోతున్న రైతులు
- ఇష్టానుసారంగా నర్సరీల నిర్వహణ
- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- పట్టని అధికారులు

జడ్చర్ల: సంప్రదాయ పంటల నష్టాల నుంచి బయటపడేందుకు ఇప్పుడిప్పుడే వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై మొగ్గుచూపుతున్న రైతులకు ఉద్యాన నర్సరీలు గుదిబండగా మారాయి. నర్సరీల నిర్వాహకులు నాసిరకం నారు అంటగట్టి రైతులను మరింత నష్టాల ఊబిలోకి నెడుతున్నారు. రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో నర్సరీ యజమానులు చెప్పే మాటలే వారికి వేదమవుతన్నాయి. ఫలితంగా నర్సరీల యజమానులకు సిరులు కురిపిస్తుండగా.. రైతులకు మాత్రం నష్టాలు, కష్టాలు మిగులుతున్నాయి. మరోవైపు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించి పుట్టగొడుగుల్లా వెలుస్తున్న నర్సరీలు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. నారుకు డిమాండ్ పెరిగే కొద్దీ మొక్కల ధరలకు రెక్కలొస్తున్నాయి. మహబూబ్‌నగర్, జడ్చర్ల, వనపర్తి, నారాయణపేట ప్రాంతాల్లో టమాటా, మిరప, వంకాయ, ఉల్లి తదితర నారును ఎక్కువగా నర్సరీల్లో పెంచుతున్నారు.

జాడలేని అనుమతులు..

నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నర్సరీలను నిర్వహిస్తున్నారు. తమ ఇష్టానుసారంగా నాణ్యత లేని విత్తనాలను నారుగా పోసి రైతులకు అంటగడుతున్నారు. నర్సరీ నిర్వాహకుల తీరుతో రైతులు నష్టపోతున్నారు. అధికారిక అనుమతులు లేకపోవడంతో నష్టపరిహారం కోరే వీలు కూడా లేకుండా పోతుంది. ఇదేమని నర్సరీల నిర్వాహకులను నిలదీస్తే.. రైతులదే తప్పన్నట్లుగా బుకాయిస్తున్నారు. సరైన పద్ధతులు పాటించక పోవడంతోనే దిగుబడులు రాలేదంటూ రైతులపై ఎదురుదాడికి దిగుతున్నారు.

ఆదాయ వనరుగా..

ఉద్యాన పంటలు అంటే పండ్లు, కూరగాయలు, పూలు, ఇతర అలంకరణ మొక్కలు. వీటిలో పండ్లు, కూరగాయలకు సంబంధించిన నర్సరీలను ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా నిర్వహిస్తున్నారు. ఈ పంటలు రైతులకు మంచి ఆదాయ వనరుగా ఉండటమే గాక కూరగాయలలో ఆహార నాణ్యతను కూడా మెరుగుపరుస్తాయి.

ఇవీ నిబంధనలు..

నిబంధనల మేరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలు విక్రయించే విత్తనాలను నర్సరీల యజమానులు కొనుగోలు చేసి నారు పోయాల్సి ఉంటుంది. ఆ విత్తనాలకు సంబంధించి కంపెనీ, లాట్ నంబర్ తదితర కచ్చితమైన బిల్లులు తీసుకోవాలి. అదే విధంగా రైతులకు నారు విక్రయించే ముందు రైతు పేరు, గ్రామం, కొనుగోలు చేసిన నారు రకం, ధరతో పాటు రికార్డుల్లో నమోదుచేసి విధిగా బిల్లు అందజేయాలి. నాసిరకం నారు కారణంగా పంట దిగుబడి రాకపోతే ఆ బిల్లు ఆధారంగా కంపెనీ యాజమాన్యంతో పంట నష్టపోయిన రైతుకు పరిహారం కోరే వీలుంటుంది. అదే విధంగా నర్సరీ ప్రధాన ద్వారం వద్ద ఒక బోర్డు ఏర్పాటుచేసి.. నర్సరీలో లభించే మొక్కలు, వాటి ధరలు తెలుగులో రైతులకు అర్థమయ్యే విధంగా రాసిపెట్టాల్సి ఉంటుంది. జడ్చర్ల, బాలానగర్ తదితర ప్రాంతాల్లో నర్సరీల యజమానులు ఇలాంటి నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. సీజన్‌లో టమాటా, మిరప, వంకాయ తదితర నారు ఒక్కో మొక్క 60 పైసల నుంచి రూపాయి దాక విక్రయిస్తున్నారు.

- నర్సరీ ఏర్పాటు చేసుకునే ముందు సంబంధిత యజమాని ఉద్యానశాఖకు చిరునామాతో కూడిన దరఖాస్తు చేసుకోవాలి. సొంత భూమి లేదా అధికారికంగా లీజు తీసుకున్నారా అనే వివరాలను పొందుపర్చాలి. అనంతరం ఉద్యానశాఖ అధికారులు స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలిస్తారు. మట్టి, నీరు, గాలి, వెలుతురు సక్రమంగా ఉన్నాయా లేదా అనే పలు అంశాలపై నివేదిక తయారు చేస్తారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఉద్యానశాఖ నుంచి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.

నర్సరీలే ఆధారం..

గతంలో రైతులు సొంతంగా కూరగాయల నారు పోసుకునేవారు. కానీ కాలక్రమేణ నర్సరీల రంగప్రవేశంతో సొంతంగా కూరగాయల నారు పెంపునకు రైతాంగం స్వస్తి పలికింది. కూరగాయల పంటల సాగుకు నర్సరీలలో పెంచే నారే (మొక్కలు) ఆధారమయ్యాయి. రైతుల డిమాండ్‌ను ఆసరా చేసుకున్న నిర్వాహకులు ఇష్టానుసారంగా నాసిరకం మొక్కలను పెంచి రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



జడ్చర్ల సమీపంలో నిర్వహిస్తున్న నర్సరీ

నారు వయసు, ఎత్తు ఇలా..

నర్సరీల్లో పెంచే టమాటా, వంకాయ, మిరప, ఉల్లి తదితర నారు వయసు 14 నుంచి 72 రోజుల వరకు ఉండాలి. అదే విధంగా ఆకులు 3 నుంచి 8 ఉండాలి. ఎత్తు 6 సెం.మీ. నుంచి 12 సెం.మీ. వరకు ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి అంతంతే..



నర్సరీల్లో పోసిన మిరప, టమాటా, ఉల్లి నారును కొనుగోలుచేసి సాగు చేశాను. కానీ నర్సరీ నిర్వాహకులు చెప్పిన విధంగా దిగుబడి రాలేదు. సాగు వ్యయం పెరిగింది. దిగుబడి మాత్రం పెద్దగా రాకపోవడంతో నష్టపోయాం. ఇందుకు సంబంధించి నిర్వాహకులు ఎలాంటి బిల్లులు ఇవ్వకపోవడంతో నష్టపరిహారం కోరే పరిస్థితి లేకుండా పోయింది. – రాంలింగారెడ్డి, రైతు, పెద్ద ఆదిరాల

అనుమతులు లేకపోతే చర్యలు..



జడ్చర్ల, బాలానగర్ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసుకున్న నర్సరీలను తనిఖీ చేసి అనుమతులు, నిర్వహణను పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నర్సరీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.నర్సరీల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. – మహేందర్, ఉద్యానశాఖ అధికారి, జడ్చర్ల

గత ప్రభుత్వంలో ఆర్థిక విధ్వంసం



జోగుళాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితరులు

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్

అలంపూర్: రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా దక్షిణకాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి అలంపూర్ చేరుకున్న స్పీకర్ స్థానిక టూరిజం హోటల్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అక్కడ కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్యే విజయుడు స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ జోగుళాంబ అమ్మవారి మహిమతో రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కారమై సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి శక్తి సామర్థ్యాలు అందించాలని అమ్మవారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సరి చేసుకుంటూ అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. హామీలతోపాటు అభివృద్ధి పనులు సైతం ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డికి అమ్మవారు శక్తిని ఇవ్వాలని కోరుకున్నట్లు చెప్పారు. ఆలయాల అభివృద్ధికి తనవంతుగా సహకారం అందిస్తానన్నారు. అంతకు ముందు ఆలయానికి వచ్చిన స్పీకర్‌కు ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్ అర్చకులతో కలిసి ఆలయ మర్యాదాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ముందుగా బాలబ్రహ్మేశ్వరస్వామి, తర్వాత జోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ చైర్మన్, ఈఓలు శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామచందర్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు



కలెక్టర్, అధికారులతో చర్చిస్తున్న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్రీయ విద్యాలయాల తరహాలో ప్రతి మండలంలో రెండు లేదా మూడు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కావాల్సిన సౌకర్యాలు, వసతులు ఎలా ఉండాలనే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, ఎంఈఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీట్ల కోసం కొట్టుకున్న మహిళలు

మాగనూర్ (మక్తల్): రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు పుణ్యమా.. నిత్యం ఎక్కడో ఒక చోట గొడవకు దారితీస్తోంది. నారాయణపేట నుంచి మక్తల్ మధ్య తిరిగే షటిల్ బస్సులో ఇద్దరు మహిళలు సీట్ల కోసం చెప్పులతో కొట్టుకున్న సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం నారాయణపేట బస్టాండులో బస్సు ఎక్కిన మహిళలు సీట్ల కోసం మాటలు, చీవాట్లతో ఘర్షణ మొదలైంది. చివరికి అది చెప్పులతో కొట్టుకుని దుస్తులు చింపుకొనే వరకు వచ్చింది. ఈ గొడవ మక్తల్ బస్టాండ్‌కు వచ్చే వరకు గంటసేపు కొనసాగింది. సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన కండక్టర్‌పై కూడా బూతు పురాణం అందుకోవడంతో వెనక్కు తగ్గారు. తోటి ప్రయాణికులు కూడా వారిని నిలువరించలేక.. చూస్తూ ఉండిపోయారు.



బస్సులో కొట్టుకుంటున్న మహిళలు

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

కల్వకుర్తి రూరల్: మండలంలోని ముకురాల గ్రామానికి చెందిన కొత్త శ్రీనివాసరెడ్డి(36) ఉరివేసుకొని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. వివరాలిలా.. మంగళవారం శ్రీనివాసరెడ్డి తల్లిదండ్రులు భాగ్యమ్మ, రుక్మారెడ్డి, భార్య శ్రీవిద్య వ్యవసాయ పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాసరెడ్డి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం పొలం వద్ద నుంచి ఇంటికి వచ్చిన తల్లి, భార్య ఇంటి తలుపు తెరిచి చూడగా శ్రీనివాస్‌రెడ్డి ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ మాధవరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరెడ్డి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.



శ్రీనివాసరెడ్డి (ఫైల్)

ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ప్యానల్ ఘన విజయం



నరేంద్రచారి



నరేందర్‌గౌడ్



యాదయ్య

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ప్యానల్ ఘన విజయం సాధించింది. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌కు 30 ఏళ్ల తర్వాత ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో జర్నలిస్టు యూనియన్లను కాదని ఇండిపెండెంట్ ప్యానల్‌కు ఏకపక్షంగా జర్నలిస్టులు గెలుపును కట్టబెట్టారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ ఎన్నికల్లో పెద్దసంఖ్యలో జర్నలిస్టులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 250 ఓట్లకు గాను 243 ఓట్లు పోలయ్యాయి. మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా నరేంద్రచారి (హెచ్‌ఎం టీవీ), ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌గౌడ్ (ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా పి.యాదయ్య (సాక్షి), ఉపాధ్యక్షులుగా చింతకాయల వెంకటేష్ (ఐన్యూస్), అక్కల ధరణికాంత్ (వెలుగు), అంజిలయ్య (టీవీ9), సహాయ కార్యదర్శులుగా మణిప్రసాద్ (ఏబీ న్యూస్), పుట్టపాగ సతీష్‌కుమార్ (నమస్తే తెలంగాణ), కృష్ణ (సూర్య), ఈసీ మెంబర్లుగా ఇట్కలి మోహన్‌దాస్ (సాక్షి), రాంకొండ (ఆర్ టీవీ), జి.రవికుమార్ (ఆంధ్రజ్యోతి), కె.వెంకట్రాములు (నమస్తే తెలంగాణ), అబ్బుల్ అహద్ సిద్దిఖీ (సహారా), షాబుద్దీన్ ముల్ల (ఎత్తెమాద్) గెలుపొందారు. అనంతరం గెలుపొందిన ప్యానల్ మెట్టుగడ్డ నుంచి న్యూటౌన్, బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా, గడియారం చౌరస్తా, పాతబస్టాండ్, తెలంగాణ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేందర్‌చారి మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ విజయం జర్నలిస్టులకు అంకితం ఇస్తున్నామని, తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుకు ఏ ఆపద వచ్చినా ముందుండి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

కబ్జాల నేపథ్యంలో భూ సర్వే

ఊర్కొండ: ప్రభుత్వ భూమి కబ్జాల నేపథ్యంలో ఎమ్మెల్యే సూచన మేరకు జిల్లా భూసర్వే నిర్వహించారు. మండల కేంద్రంలో కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న సర్వే నంబర్లు 401, 402, 403, 410లలో వెంచర్లు ఏర్పాటు చేశారు. అయితే వీటి మధ్యలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్లు 310, 400లలో గతంలో కొందరు కబ్జా చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఎన్నికల సమయంలో ప్రభుత్వ భూములు కబ్జాల నుంచి కాపాడుతానని ప్రస్తుత ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగానే ఎమ్మెల్యే ఆదేశాలతో మంగళవారం జిల్లా సర్వే అధికారులు భూ సర్వే చేపట్టారు. భూ సర్వే సందర్భంగా ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా ఎస్‌ఐ కృష్ణదేవ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. భూ సర్వే వివరాల విషయమై తహసీల్దార్ యూసుపొద్దీన్‌ను సంప్రదించగా పూర్తి వివరాలు మరోసారి భూ సర్వే చేసిన తర్వాత వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

తోటల్లో పండు ఈగను నివారిద్దాం



పండు ఈగ



చెట్టుకు వ్రేలాడదీసిన ఫెరబోను

పాడి-పంట

గద్వాల జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: సాగులో ఉన్న పండ్లు, కూరగాయల తోటల్లో పండు ఈగ బాగా కనిపిస్తోంది. ప్రధానంగా మామిడిలో పండ్లు పక్వ దశలో ఈ పండు ఈగ బాగా నష్టపరుస్తోంది. ఈ పండు ఈగ వల్ల కలిగే నష్టాలను వ్యవసాయ జిల్లా అధికారి సక్రీయ నాయక్ రైతులకు వివరించారు. వాటి నివారణ చర్యలు సూచించారు.

పండు ఈగ వల్ల నష్టాలు..

తల్లి ఈగలు కాయ పక్వానికి వచ్చే దశలో 150 నుంచి 250 గుడ్లను కాయ లోపలి భాగంలో పెడుతుంది. 4 రోజుల్లో గుడ్ల నుంచి పిల్ల లార్వాలు బయటికి వచ్చి కాయలోపలి కండను, మాగుతున్న గుజ్జును తింటాయి. పిల్ల పురుగులు తెల్లగా ఉంటాయి. పిల్ల పురుగులు సంచిరించిన ప్రాంతం కుళ్లి మెత్తబడుతుంది. కాయ, పండ్లపై సన్నని రంధ్రాలు ఏర్పడతాయి. పండ్లు రాలి కిందపడిపోతాయి.

పండు ఈగ నివారణ..

- పండు ఈగ సోకి రాలిన పండ్లు, కాయలను వారానికి ఒక సారి ఏరి నేలలో పూడ్చిపెట్టాలి. దీని వల్ల పిల్ల పురుగులు చనిపోతాయి.
- వరుసల మధ్య సేద్యం చేయడం వల్ల కోశస్థ దశలో పురుగులు బయట పడి పక్షులు తినడం వల్ల చనిపోతాయి.

ఫెరమాను బోనుతో పండు ఈగ నివారణ..

రెండు రంధ్రాలు గల ప్లాస్టిక్ డబ్బాలో మగ ఈగను ఆకర్షించే రసాయనాలు పూసిన అట్ట ముక్క ఉంటుంది. ఈ ముక్కపై 8 చుక్కల నువాన్ లేదా మలాథీయాన్ పిల్లర్‌తో వదిలి ఉంచుతారు. తర్వాత ప్లాస్టిక్ డబ్బాకు మూతను బిగించాలి. ఈ డబ్బాను చెట్టు కొమ్మకు వేలాడ దీయాలి. ఈ డబ్బాలో ఉన్న అట్ట ముక్కకు ఉన్న రసాయనాలకు మగ ఈగ ఆకర్షింపబడి డబ్బాలోకి వచ్చి మందు ప్రభావానికి గురై చనిపోతాయి.

ఫెరాబోను వాడే పద్ధతి..

- ఈ బోనులను కాయ పక్వానికి చేరువయ్యే దశకు కనీసం 60 రోజుల ముందు చెట్లకు వేలాడదీయాలి.
- బోనులను 3 నుంచి 4 అడుగుల ఎత్తులో కొమ్మలకు కట్టాలి.
- బోను నీడలో ఉండే విధంగా చూడాలి.
- దీని వల్ల మందు ప్రభావం ఎక్కువ రోజులు ఉంటుంది.
- అప్పుడప్పుడు బోనులో ఉన్న మగ ఈగలను తీసి వేయాలి.
- అట్ట ముక్కపై వేసిన పురుగు మందు ప్రభావం 12 రోజులు ఉంటుంది.
- కాబట్టి 12 రోజులకు మరల అట్టముక్కపై 5 నుంచి 6 చుక్కల నువాన్ లేదా మలాథీయాన్ వేసి మరల ప్లాస్టిక్ డబ్బాకు మూత పెట్టాలి.

ఫెర బోను లభించే ప్రదేశాలు..

రెయిన్‌బో అగ్రివెట్ టెక్నాలజీ బెంగుళూరు వా రు వీటిని సరఫరా చేస్తారు. కావాల్సిన రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తనిఖీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని వీరన్నపేట, టీడీగుట్ట మైదానం తదితర ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం వన్‌టౌన్ సీఐ అప్పయ్య ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు జరిపారు. అలాగే గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే నష్టాలను ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా దుర్వ్యసనాలకు బానిసలై పోలీసులకు పట్టుబడితే చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యార్థులు సత్ప్రవర్తన, క్రమశిక్షణతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ డి.ఇందిర సూచించారు. మంగళవారం ఏనుగొండలోని రెడ్‌క్రాస్ సన్నిధి ఆశ్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థినుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. మంచి నడవడిక కలిగి ఆత్మస్థైర్యంతో చదువుకుంటే ఉత్తమ భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్మద, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి ఎస్.జగపతిరావు, సభ్యులు జి.రమణయ్య, అశ్విని చంద్రశేఖర్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరమ్మ, మేనేజర్ అనేల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

తిమ్మాజిపేట: మండలంలోని చేగుంటలో ఫైనాన్స్ సిబ్బంది వేధింపుల కారణంగా ఈ నెల 3న ఓ యజమాని ట్రాక్టర్‌ను దహనం చేశాడు. గ్రామానికి చెందిన గడ్డం రవి ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. సకాలంలో కిస్తులు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సిబ్బంది ఇబ్బందులకు గురిచేశారు. దీంతో క్షణికావేశంలో ట్రాక్టర్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టాడు. విషయం తెలుసుకున్న ఎల్‌ఎన్‌టీ ఫైనాన్స్ ఏరియా మేనేజర్ చంద్రశేఖర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

- మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్ [illegible]

WANTED

- MG కార్ షోరూం మహబూబ్‌నగర్‌లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్ట్, మెకానిక్‌లు కావలెను. సెల్ : 9491402020, 9492628629.
- SRIMARK PROJECTS కం॥కి Hyd లోని అన్ని ప్రభుత్వ అనుమతుల Mega ప్రాజెక్ట్స్ మార్కెటింగ్ చేయుటకు కం॥డైరెక్ట్ పొజిషన్స్‌కి టీం లీడర్స్ కావలెను. జీవితాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని కసి, తపన ఉన్నవారు మాత్రమే సంప్రదించండి. ఫోన్: 9948453222
- Wanted Sr.Accts Exec, Apply before 19th May On https://www.indiaalliance.org/career
- ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. ఫోన్: 8977639663, 8977639662
- Wanted trained or experienced pre-primary (mother teachers) primary teachers and HODs. English medium background is must. Transport fecility will be provided to teachers from mahabubnagar. Chaitanya vidyaniketan school, Nancherla contact No: 9704789007, 9177812302

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటి నిజానిజాలు పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు – సాక్షి మేనేజ్‌మెంట్